“మనం ఆమెని పట్టేది రికమండేషన్ గురించి మరెందుకోసమో కాదు” పళ్ళు కొరుకుతూ అన్నాడు వెంకట్రావ్ .

“ఓ... అందుకా..” తేలికగా ఊపిరి పీల్చుకున్నాడు బుచ్చిబాబు.

“ఆమె చెపితే ఈ మిన్నారావు క్రిందా మీదా పడి మన పని చేస్తాడు”

వెంకట్రావ్ ఇలా అంటుండగానే మినిస్టర్ మిన్నారావు కారు వచ్చి ఇంటి గేటులోంచి లోపలికి దూసుకెళ్ళింది.

“మిన్నారావు వచ్చేశాడు” వెంకట్రావ్ లేచి నిలబడ్డాడు.

ఇద్దరూ మిన్నారావ్ ఇంటివైపు అడుగులు వేసారు.

“నువ్వు నా పక్కనే కులాసాగా నిలబడి ఫోజులు కొట్టకుండా నీకు ఒంట్లో బాగోలేదని... విజయవాడ.... నీళ్ళు పడవని చెప్పు...కాస్త దీనంగా చెప్పు!...” అన్నాడు వెంకట్రావ్.

“అలా చెపితే సిల్లీగా వుండదా?” సందేహంగా అడిగాడు బుచ్చిబాబు.

“ఉండదు ఏ కారణం చెప్పకుండా ట్రాన్స్‌ఫర్ ఆపమంటేనే సిల్లీగా వుంటుంది”.

ఇద్దరూ గేటుని సమీపించారు. గూర్ఖా ఇద్దరికి సెల్యూట్ కొట్టి లోపలకు పంపించాడు.

“ఏంటి?” అని హాల్లో వున్న పియే అడిగాడు.

“మినిస్టరిగారిని కలవాలి. వీరేశంగారు పంపించారని చెప్పండి” అన్నాడు వెంకట్రావ్ .

పి.యే లోపలకు వెళ్ళి అరనిముషంలో బయటకి వచ్చాడు.

“కూర్చోండి....” అన్నాడు ఇద్దరితో.

ఇద్దరూ సోఫా అంచున కూర్చున్నారు. మినిస్టర్ మిన్నారావు ఎప్పుడొస్తాడా అని ఎదురుచూస్తూ. పియే లోపలికీ బయటకి తిరుగుతున్నాడు.

అయిదు నిముషాలు, పది...పదిహేను నిముషాలు ....టైమ్ గడుస్తోంది, కానీ మినిస్టర్ మిన్నారావు బయటకి రాలేదు.

“మీరు మేం వచ్చినట్టు చెప్పారా?” అక్కడ ఉన్న పియేని సందేహంగా అడిగాడు వెంకట్రావ్.

“చెప్పాకే ఆయన కూర్చోమని చెప్పారు” చెప్పాడు పీయే.

“మరి ఇంకా రాలేదు కదా?” మొహమాట పడుతూ అన్నాడు వెంకట్రావ్.

“అంటే ఛాం ఛాం హేర్‌కటింగ్ సెలూన్ ఓపెన్ చేసి అలసిపోయివచ్చారు కదా. అందుకని కాస్సేపు నడుం వాలుస్తానన్నారు” అని చెప్పి బయటకెళ్ళిపోయాడు పియే.

ఆ మాట విని అంతసేపూ సోఫాలో అంచుమీద కూర్చున్నందుకు తిట్టుకుంటూ పూర్తిగా వెనక్కి జారబడి రిలాక్స్ అయ్యారు. అరగంట గడిచింది. మినిస్టర్ మిన్నారావు హఠాత్తుగా బయటికి వచ్చాడు.

అరమోడ్పు కళ్ళు వేస్కుని కాళ్లు బార్లా చాసి సోఫాలో మిశ్రమించిన అ ఇద్దర్ని చూసి

“ఓర్నియవ్వ...ఛాం ఛాం సెలూన్ మీరే ఓపెన్ చేసినట్లు అంత

అలసిపోయారేంటయ్యా!?" అన్నాడు వాళ్ళు ఎదురుగా కూర్చోంటూ.

ఈ హఠాత్పరిణామానికి ఇద్దరూ కంగారుగా లేచి నిలబడ్డారు. "న....న.......... నమస్కారం సార్" అన్నారు కోరస్‌గా.

"మీరేనా వీరేశం పంపిన మనుషులు?"

ఇద్దరూ వినయంగా చేతులు కట్టుకుని తలలు ఉపారు.

వెంటనే మినిస్టర్ మిన్నారావు జేబులోంచి ఓ ఫోటో తీసి వాళ్ళ ముందున్న టీపాయ్‌మీద పడేసాడు. వెంకట్రావ్ అయోమయంగా ఆ ఫోటో చేతిలోకి తీసుకున్నాడు. ఇద్దరూ ఆ ఫోటోని కళ్ళార్పకుండా చూసారు.

ఆ ఫోటోని మిన్నారావు ఎందుకిచ్చాడో వాళ్ళకి అర్థం కాలేదు. కొంపదీసి ఆ రికమెండేషన్ గురించి ఆ ఫోటోలోని మనిషిని కలవమని చెప్పడు కదా?" అనుకున్నారిద్దరూ.

ఇంట్లో "ఠాప్ ...." మని శబ్దం వినిపించింది.

ఇద్దరూ ఉలిక్కిపడి తలెత్తి చూశారు. టీపాయ్ మీద వంద రూపాయల నోట్ల కట్టలు అయిదు వున్నాయి. అంటే యాభైవేలు.

"ఆ డబ్బు తీస్కోండి" అన్నాడు మినిస్టర్ మిన్నారావ్.

బుచ్చిబాబు ఉక్కిరిబిక్కిరయ్యాడు.

"ఈ మినిస్టర్ చాలా మంచివాడిలా వున్నాడు. మనకి ట్రాన్స్‌ఫర్ కాన్సిల్ చేయించి పెట్టడం కాకుండా ఎదురు డబ్బులు కూడా ఇస్తున్నాడు. యాభైవేలు!" వెంకట్రావ్ చెవిలో సంబరంగా అన్నాడు.

"నీ బొంద అదేంకాదు...! ఇందులో ఏదో తిరకాసుంది" బుచ్చిబాబుని చెవిలో తిట్టి "ఏంటి సార్ ఇది? యాభైవేలు ఇస్తున్నారు?" అన్నాడు వెంకట్రావ్ మిన్నారావుతో.
"అంతేనయ్యా. నేను పూర్తి డబ్బులు ముందుగా ఇవ్వను. పని పూర్తయ్యాక మిగతా యాభైవేలు ఇస్తాను. ఆ ఫోటోలో వాడిని జాగ్రత్తగా చూడండి. కావాలంటే ఫోటోని మీకూడా తీసుకెళ్ళండి. కానీ వారంరోజుల్లోగా వాడు ఖతం కావాలి!"

వెంకట్రావ్, బుచ్చిబాబు వాళ్ళ మధ్య బాంబు పడినట్లు ఉలిక్కిపడ్డారు. వెంకట్రావ్ చేతిలోంచి ఫోటో జారి కిందపడింది.

"వాడి పేరూ, అడ్రసూ, మిగతా వివరాలు ఇదిగో ఈ కాగితంలో రాసున్నాయి" అంటూ మినిస్టర్ మిన్నారావు వెంకట్రావ్ చేతికి ఓ కాగితం అందించబోయాడు. కానీ వెంకట్రావ్ ఆ కాగితాన్ని అందుకోలేదు.

"వీడి కంటికి మనం ప్రొఫెషనల్ కిల్లర్స్‌లాగా కనిపిస్తున్నామా?" అని అనుకుని తమని తాము ఓసారి చూసుకుని తర్వాత ఇద్దరూ ఒకరి నొకరు పట్టుకుని ఘొల్లుమన్నారు.

"ఏందయ్యా ఇదీ...మీలాంటి కరుడుకట్టిన నేరగాళ్ళకు ఇంత జాలి వుండకూడదు. కసుక్కున తెగ సరికెయ్యడమే. ఆ నాయాలు నా రాజకీయ ప్రత్యర్థి.....నన్నెంతగా

ఏడిపిస్తున్నాడో తెలుసా?" అన్నాడు మిన్నారావు.

"అది కాదు సార్ ....... మేము మీరనుకుంటున్న మనుషులం కాదు. మేం వేరే పనిమీద వచ్చాం సార్!" అన్నాడు వెంకట్రావ్ బిక్కమొహం వేసి.

ఆ దెబ్బకి మినిస్టర్ మిన్నారావ్ కంగారుపడిపోయి క్రిందపడిన ఫోటోని తీస్కుని వివరాల కాగితంబాటు జేబులో పెట్టేసుకున్నాడు.

"ఆ విషయమ ముదుగా చెప్పొద్దయ్యా..... తేరితో! ఇంతకీ మీరెందుకొచ్చారు?" విసుక్కుంటూ అన్నాడు మినిస్టర్ మిన్నారావ్.

వెంకట్రావ్ చేతిలోవున్న పళ్ళూ, స్వీట్లూ టీపాయ్ మీద పెట్టి జేబులోంచి వీరేశం ఇచ్చిన లెటర్ తీసి మిన్నారావ్‌కి ఇచ్చాడు. మినిస్టరు మిన్నారావ్ అ నాలుగులైన్ల ఉత్తరాన్ని కూడబలుక్కుని కూడబలుక్కుని పది నిముషాలు చదివి "అయితే నువ్వేనా బుచ్చిబాబువి ?" అని అడిగాడు వెంకట్రావ్ .

"కాదండీ! ఇతను!!" అంటూ బుచ్చిబాబుని చూపించాడు వెంకట్రావ్ .

బుచ్చిబాబు వెంటనే దీనంగా మొహం పెట్టేడు "సార్..... ఆ హెడ్డాఫిసోళ్ళు ఇప్పుడు నన్ను అనవసరంగా ట్రాన్స్‌ఫర్ చేసారు సార్. నా ఆరోగ్యం అసలే బాగోదు సార్. దానికి తోడు ఆ విజయవాడ నీళ్ళు కూడా నాకు పడవు సార్.... మీరే నన్ను రక్షించాలి సార్!" అన్నాడు గద్గద స్వరంతో.

"సర్లేవయ్యా..... ట్రాన్స్‌ఫర్ అయిన ప్రతి ఒక్కరు చెప్పేమాటలే నువ్వూ చెప్తున్నావ్. ఫేసులో ఆ ఫిలింగ్స్ మార్చు. ఏదో ఒకటిచేసి నీ ట్రాన్స్‌ఫర్ కాన్సిల్ చేయిద్దాంలే " అన్నాడు మిన్నారావు.

"థాంక్యు సార్!" అన్నాడు బుచ్చిబాబు ఆనందంగా.

ఈలోగా టీపాయ్ మిదున్న ఫోన్ మోగింది. మినిస్టర్ మిన్నారావు ఫోన్ ఎత్తి "హలో...." అన్నాడు.

ఓ అరనిముషంపాటు అవతలివారు చెప్పింది ఓహో!....అట్టానా! అంటూ విన్నాడు.

"అయితే మీ మటన్ షాపు ఓపెనింగ్ చెయ్యాలంటావ్. సర్లేవయ్యా.... అట్టాగే కానీయ్. ఎప్పుడు? ఎల్లుండి పొద్దునా...సరేసరి....ఇందాక నాచేత ఛాం ఛాం హేర్ కటింగ్ సెలూన్ ఓపినింగ్ చేయించారయ్యా. నాతోనే ఎవడికో క్రాఫ్ చేయించి ప్రారంభించారు. బంగారు కత్తెరతో క్రాఫింగ్ చేశా... ఆ కత్తెర నాకే ఇచ్చేశారు. చాలా గ్రాండ్‌గా చేశారనుకో మీరు కూడా ఆ లెవెల్‌లో ఓపెనింగ్ చేయ్యాలా! ఏంటి...నాచేత కైమా కొట్టించి ఓపెనింగ్ చేయిస్తారా? అవ్వాల్‌రైట్. అట్టాగే ...కానీ కైమా కొట్టడానికి బంగారు కత్తి తెప్పించండి. ఏంటి... ఆ స్థోమతే వుంటే మాంసం షాపు కాకుండా బంగారం షాపే పెట్టుకునుండేవాడివా? పోనీ కనీసం వెండి కత్తెయినా తెప్పించండయ్యా బాబూ..।అలాగేనా?! సరే....సరే...వచ్చేస్తున్నా...." అని ఫోన్ పెట్టేసాడు మినిస్టర్ మిన్నారావు.

“యదవ నా కొడుకులు... నాతో క్రైమా కొట్టిస్తారంటగానీ బంగారు కత్తి తెప్పించరంట. పీనాసి నాయళ్ళు ....” అని తిట్టి “మీరిక వెళ్ళిరండయ్యా...మీ సంగతి నేను చూస్కుంటాలే” అన్నాడు.

ఇద్దరూ మరోసారి థాంక్స్ చెప్పి వెళ్ళబోతుంటే “వెళ్ళిపొమ్మనగానే వెళ్లిపోవటమే... నేను చెప్పే మరో మాట వినివెళ్ళండి” అన్నాడు.

“ఏంటి సార్?” అడిగాడు బుచ్చిబాబు.

“నీ ట్రాన్స్ఫర్ ఆపడానికి అయిదువేలు ఇవ్వాలి! రేపు ఉదయమే పట్టుకొచ్చి ఇచ్చెయ్”

బుచ్చిబాబు తెల్లమొహం వేశాడు.

“ఏంటయ్యా అలా చూస్తావ్, మా వీరేశం చెప్పాడు కాబటి అయిదువేలు... లేకపోతే ఇట్టాంటి కేసులకి పదివేలకి తక్కువ తీస్కోను” అన్నాడు మిన్నారావ్.

వెంకట్రావ్ బుచ్చిబాబుకి కనుసైగ చేసాడు. బుచ్చిబాబు “అలాగే సార్” అంటూ తల ఊపాడు.

నాలుగు రోజులు గడిచాయి.

అఫీసులో ఓ రోజు ప్యూన్ వచ్చి “సార్ మిమ్మల్ని అయ్యగారు పిలుస్తున్నారు!” అని బుచ్చిబాబుకి చెప్పాడు.

బుచ్చిబాబు రాస్తున్న ఫైలు ప్రక్కన పెట్టి ఏకాంబరమ క్యాబిన్లోకి వెళ్ళాడు.

“పిలిచారా సార్?” అడిగాడు బుచ్చిబాబు .

“ఆ....రావోయ్ రా! మొత్తానికి నువ్వో టంగుటస్కాయ్వోయ్!!” అన్నాడు ఏకాంబరం.

“అంటే అది తిట్టా  పొగడ్తా సార్?” అయోమయంగా అడిగాదు బుచ్చిబాబు.

“పొగడ్తేనేయ్..... నీకో గుడ్ న్యూస్! నీ ట్రాన్స్ఫర్  ఆర్డర్ క్యాన్సిల్ అయ్యింది. ఇప్పుడే హెడ్డాఫీసు నుండి లెటరు వచ్చింది అది చెప్దామనే పిలిచాను. మొత్తానికి సాధించావోయ్... కంగ్రాట్స్!”

“ధాంక్యూ సార్ !”

బుచ్చిబాబుకి సంతోషంతో గట్టిగా కేక పెట్టాలని అనిపించింది. కానీ ఏకాంబరం అర్ధం కాని తిట్లు తిడ్తాడని భయపడి ఊరుకున్నాడు.

“ఇంక నీ సీట్లోకెళ్ళి జాగ్రత్తగా పని చేస్కో .... ఏం?” అన్నాడు ఏకాంబరం.

“అలాగే సార్ ...” అని క్యాబిన్ బయటకొచ్చిన బుచ్చిబాబు ఇంక సంతోషాన్ని ఆపుకోలేక.

“యాహూ!” అని అరిచాడు.

లోపలున్న మేనేజర్ ఏకాంబరం  ముందు ఉలిక్కిపడి తర్వాత గట్టిగా కసిగా తిట్టుకున్నాడు. బుచ్చిబాబు పెట్టిన కేకకి హాల్లోని అందరూ ఘోరంగా ఉలిక్కిపడ్డారు. హెడ్ క్లర్క్ సదాశివం ఇంకు బాటిల్ని టేబుల్  మీద ఒంపేసుకున్నాడు. టైపిస్టు లత కళ్ళు గడగడా

వణికి పూర్తిగా ఒక సెంటెన్స్ మొత్తం తప్పుల తడకలు టైపు కొట్టింది.

"ఈయన అరుపు పాడుగాను...." అనుకుంటూ నోట్లో చీరకొంగు దోపుకుని గుడ్లనీరు కుక్కుకుంటూ కుమిలిపోసాగింది లత.

"ఏంటమ్మా ... ఏమైంది?" కంగారు పడుతూ అడిగాడు సదాశివం.

"బుచ్చిబాబు పెట్టిన కేకకి ఒక సెంటెన్స్ మొత్తం తప్పు టైపు చేసానండీ. ఊహూ.... ఊహూ..... ఊహూ....." బాధతో ఊగిపోతూ అంది లత.

"దానికి అంతగా బాధపడాలామ్మా?" ఆశ్చర్యంగా చూస్తూ ఆడిగాడు సదాశివం.

"మీరలానే అంటారండీ. ఈ లెటర్ తీస్కుని నేను బాస్ క్యాబిన్ లోకెళ్తే మళ్ళీ ఏకాంబరం కిల్లారికిత్తి అనో, డివ్వాల డివ్వి అనో నన్ను బూతులు తిట్టేస్తాడు!" కుమిలిపోతూ అంది లత.

"అది నిజమేనమ్మా! పోనీ ఓ పని చెయ్యరాదూ? ఆ పేపర్ తీసేసి వేరేది పెట్టి మళ్ళీ ఫ్రెష్‌గా టైపు చెయ్యి".

"నిజమే గానీ... మళ్ళీ బుచ్చిబాబు గారు అరవరుగా?" కళ్ళు తుడుచుకుంటూ అడిగింది లత.

"ఏవోయ్ ... ఇంకా అలా అరవ్వుగా?" అడిగాడు హెడ్‌క్లర్క్ సదాశివం బుచ్చిబాబుని.

"లేదు సార్!" సిగ్గుపడుతూ అన్నాడు బుచ్చిబాబు.

"అరవడంటలేమ్మా.... నువ్వు మళ్ళీ ఫ్రెష్‌గా టైపు చెయ్యి.... అయినా ఈ సారి అరిస్తే బాస్ బయటకొచ్చి అర్థంకాని బూతులు తిట్టి ఆయన్ని చీల్చి చెండాడెయ్యడూ?" అన్నాడు సదాశివం.

"అదీ నిజమేలెండి!" అంది లత టైపు మిషన్‌లోంచి ఆ కాగితాన్ని తీసేసి వేరే వైట్ పేపర్‌ని పెడుతూ.

"ఇంతకి నువ్వు అంత ఆనందంగా అరవడానికి కారణం ఏంటి బుచ్చిబాబు ....బాస్ నిన్నే మైన డింగాల డిప్పి అని పొగిడాడా?"అడిగాడు సదాశివం.

"అంత అదృష్టం నాకెక్కడిది గానీ... నా ట్రాన్స్‌ఫర్ ఆర్డర్ కాన్సిల్ అయినట్టు హెడ్డాఫీసు నుండి లెటర్ వచ్చింది. ఇప్పుడే బాస్ పిలిచి చెప్పాడు" అన్నాడు బుచ్చిబాబు .

"ఓ..... అయితే స్వీట్ ఇవ్వాల్సిందే!"

"ఓ......తప్పకుండా....."

బుచ్చిబాబు ప్యూనుతో స్వీట్స్ తెప్పించి అందరికి పంచాడు. ఆ ట్రాన్స్‌ఫర్ ఆగడానికి అసలు కారకుడైన పక్క సెక్షన్‌లోని వెంకట్రావ్ దగ్గరికి వెళ్ళాడు బుచ్చిబాబు.

"ఊ.......... అయితే నీ ట్రాన్స్‌ఫర్ ఆగిపోయిందన్నమాట! ఆ మిన్నారావ్ మాట నిలబెట్టుకున్నాడు" అన్నాడు వెంకట్రావ్ .

"ఆ ట్రాన్స్‌ఫర్ అయిది కాబట్టి బతికిపోయాను. లేకపోతే ఆ పెళ్ళి అయ్యాక సీత ఇక్కడ... నేను విజయవాడలో ఎంత కష్టం!" అన్నాడు బుచ్చిబాబు.

“నీ మొహంలే.... అసలు పెళ్ళే ఓ పెద్ద కష్టం.....” అన్నాడు వెంకట్రావ్ .

“అలాగంటావా?”

“అవును....కోరి నష్టాలు కొని తెచ్చుకుంటున్నావు.”

“నీకు తెలియదురా..... సీత చాలా మంచిపిల్ల!” చెప్పాడు బుచ్చిబాబు.

“ఓహో! నీ సీత చాలా మంచిపిల్ల. మా పెళ్ళాలంతా గయ్యాళీలు! అదేగా నువ్వంటున్నది.

“అబ్బే...నేనలా ఎక్కడన్నాను? సిల్లీగా మాట్లాడకు!” కంగారుపడుతూ అన్నాడు బుచ్చిబాబు.

“ఇప్పుడు మేం ఏం చెప్పినా నీకు సిల్లీగానే అనిపిస్తుంది. కానీ పెళ్ళయ్యాక తెలుస్తుంది. మా మాటల్లో ఎంత నిజం వుందో.......ఎంత ప్రేమించుకుని పెళ్ళిచేసుకున్నవాళ్ళే తన్నుకుచావడం నేను చూశాను” అన్నాడు వెంకట్రావ్ .

అతడు ఆ మాట అనగానే బుచ్చిబాబుకి తన ఫ్రెండ్ కిరణ్ గుర్తుకొచ్చాడు. ఆ రోజు అతని ఇంటి గుమ్మందగ్గర నిలబడి కిరణ్ అతని భార్య తీవ్రంగా దెబ్బలాడుకోవడం స్వయంగా విన్నాడు. వాళ్ళిద్దరూ ప్రేమించి పెళ్ళిచేసుకున్నారు.

రేపు తనూ! సీత కూడా అంతేనా?

“నో....నో....వాళ్లు వేరు....నేనూ సీత వేరు” అనుకున్నాడు బుచ్చిబాబు.

0 0 0